క్లుప్తంగా

పెదరావూరు స్కూల్లో 'లెఫ్ట్ హ్యాండర్స్ డే'



తెనాలిరూరల్: మండలంలోని పెదరావూరు గ్రామ జెడ్పీ హైస్కూల్లో 'లెఫ్ట్ హ్యాండర్స్ డే'ను మంగళవారం జరుపుకున్నారు. పాఠశాలలో 470 మంది విద్యార్థుల్లో 24 మంది ఎడమ చేతి వాటం వారు ఉన్నారు. వీరిని అభినందించి ప్రోత్సాహక బహుమతులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.సరళ అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు శ్రీఅరవిందుల 152వ జయంతి వేడుక

తెనాలి: అరబిందో ఎడ్యుకేషన్ సొసైటీ, తెనాలి ఆధ్వర్యంలో శ్రీఅరవిందుల వారి 152వ జయంతి వేడుకలను ఈనెల 15న ఘనంగా నిర్వహించనున్నారు. పట్టణ నాజరుపేటలోని శ్రీఅరవింద విద్యాకేంద్రంలో అరవిందుల జయంతితోపాటు 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహిస్తామని సొసైటీ డైరెక్టర్ కె.సంపూర్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 9 గంటలకు విద్యాకేంద్రంలోని ధ్యానమందిర్‌లో సామూహిక ధ్యానం, 9.30 గంటలకు విద్యార్థుల మార్చ్ ఫాస్ట్, జెండా ఆవిష్కరణ ఉంటాయన్నారు. 10 గంటలకు 'దివ్యదీపిక' ఆవిష్కరణ ఉంటుందని తెలిపారు. ఆలిండియా రేడియో, విజయవాడ మాజీ డైరెక్టర్లు పన్నాల సుబ్రహ్మణ్య భట్టు, మంజులూరి కృష్ణకుమారి పాల్గొంటారు. 'శ్రీఅరబిందో లైఫ్ అండ్ హిజ్ మిషన్' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం ఉంటాయని వివరించారు.

విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలు

తెనాలిరూరల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని అంగలకుదురు గ్రామంలోని మాస్టర్ మైండ్స్ పాఠశాలలో విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంగీత విద్వాంసురాలు వరుసల లక్ష్మీసునీత మృదంగ విద్వాంసుడు కేవీ రామకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. దేశభక్తి గీతాలు పాడిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, స్కూల్ సిబ్బంది పర్యవేక్షించారు.

రేపటి నుంచి ధ్యానంపై శిక్షణ శిబిరాలు



తెనాలిరూరల్: శ్రీ రామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో ధ్యానంపై మూడు రోజుల ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్టు సంస్థ తెనాలి సెంటర్ కోఆర్డినేటర్ ఎ.శ్రీకృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన వివరాలను వెల్లడించారు. మారిస్‌పేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రతి రోజు సాయంత్రం ఆరు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 9848588623 నంబరులో సంప్రదించాలన్నారు.

వర్మీ కంపోస్టు తయారీపై అవగాహన

ఫిరంగిపురం: మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం రెండో రోజుకు చేరింది. ఘనవ్యర్థాల నిర్వహణ క్షేత్రస్థాయి పర్యటన , చెత్త సేకరణ, పొడిచెత్త, తడిచెత్త వేరుచేసే విధానం, వర్మీ కంపోస్టు తయారీ, మార్కెటింగ్ గురించి వివరించారు. దీనిపై గొల్లపాలెంలో క్షేత్రస్థాయి పరిశీలన, క్లాప్ మిత్రలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిబాబు, ఈఓపీఆర్డీ నిర్మలా లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

మొక్కలు నాటిన రోటరీ క్లబ్ ప్రతినిధులు

తాడేపల్లి(మంగళగిరి): తాడేపల్లిలోని పలు ప్రాంతాలలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటారు. విద్యార్థులతో కలసి మొక్కలు నాటిన ప్రతినిధులు విద్యార్థులకు మొక్కలు నాటడం, పెంపకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రతినిధులు రావూరి రమేష్‌బాబు, రవీంద్రారెడ్డి, మున్నంగి వివేకానందరెడ్డి, జొన్నా వెంకటేష్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి పరికరాలు అందజేత

మంగళగిరి: నగర పరిధిలోని కుంచనపల్లి అర్బన్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్‌కు రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో మంగళవారం రూ.3 లక్షల విలువైన పరికరాలు అందజేశారు. ఏసీ, ఫ్రిడ్జ్, కుర్చీలు, డోర్ కర్టన్స్, జిరాక్స్ మిషన్, ఇన్వర్టర్, ర్యాక్‌లు అందజేశారు. ప్రజలకు సేవలు అందించడంలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ముందుంటుందని గవర్నర్ అన్నే రత్నప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు రావూరి రమేష్‌బాబు, రవీంద్రారెడ్డి, మున్నంగి వివేకానందరెడ్డి, కాట్రగడ్డ శివన్నారాయణ, శెట్టి రామకృష్ణ, జంగాల వెంకటేష్, చొప్పర బుల్లిబాబు, శ్రీలత, కొండపాటి నరేంద్ర, రాచర్ల శ్రీనివాసరావు, శంకరశెట్టి రమేష్ పాల్గొన్నారు.

ఇటు కలుపులు.. అటు ఎలుకలు

- పిలక దశలో ఉన్న వరి పైరు
- వరిపైరును కొరికేస్తున్న ఎలుకలు
- రసాయన మందులను తట్టుకుంటున్న మూషికాలు
- బెంబేలెత్తుతున్న రైతులు
- ఖరీఫ్ వరి సాగు పనుల్లో రైతులు బిజీ



వరి నాట్లలో కలుపు తీస్తున్న కూలీలు

కొల్లిపర : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో రైతులు వరినాట్లు వేశారు. నియోజకవర్గంలో తెనాలి, కొల్లిపర మండలాల్లో 90 శాతం రైతులు వెద పద్ధతిని ఎక్కువ శాతం అనుసరించారు. మిగతా 10 శాతం నాట్లు వేస్తున్నారు. తొలుత వర్షాలు కారణంగా కొంత వెద పద్ధతి ద్వారా నాటిన వరి గింజలు మొలక రాకపోవటం, కొన్ని చోట్ల స్వల్పంగా రావటం జరిగింది. ప్రస్తుతానికి వెద పద్ధతి ద్వారా నాటిన వరి పంట ఆశాజనకంగానే ఉంది. అప్పుడప్పుడు వర్షాలు కురుస్తున్నాయి. ప్రస్తుత వాతావరణం డెల్టా ప్రాంతంలో ఖరీఫ్ వరి పైరుకు, మెట్ట సాగుకు ఆశాజనకమేనని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

58 వేల ఎకరాల్లో వరి సాగు

తెనాలి నియోజకవర్గంలో 58 వేల ఎకరాల్లో వరి సాగు రైతులు చేపట్టారు. 98 శాతం మేర రైతులు బి.బి.టీల రకాన్ని సాగు చేశారు. కొంచెం ఆలస్యమైనా జులై నెలాఖరుకు వరి నాట్లు పూర్తయ్యాయి. ముందుగా వెద పద్ధతి ద్వారా నాటిన వరి పంట పొలాల్లో అక్కడక్కడ దుబ్బు కట్టే దశకు చేరుకుంది. గత 10 రోజుల క్రితం కురిసిన వర్షాలకు ఖరీఫ్‌కు పంటకు సరిపోవటంతో ప్రస్తుతం రైతులు కలుపు తీత, ఎలుకల నిర్మూలనలో బిజీగా ఉన్నారు. వరి పైరు దుబ్బు కట్టే దశలో చేలల్లో కలుపుతీసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే పలువురు కలుపు నివారణ మందులను వాడుతున్నారు. కలుపు నివారణ మందులను వాడినా వర్షాల కారణంగా కొన్ని చోట్ల ప్రయోజనం లేక పోవడం, అధికంగా కలుపు ఉన్న చేలల్లో రైతులు కూలీలతో కలుపు తీయిస్తున్నారు. కలుపు ఎక్కువగా ఉంటే వేసిన ఎరువులు అక్కరకు రావనే ఉద్దేశంతో రైతులు కలుపుతీతకు ప్రాధాన్యమిస్తున్నారు.



వరి చేలో ఎలుకల బుట్టలు పెడుతున్న దృశ్యం

ఎలుకల దాడి ప్రారంభం

ఖరీఫ్ వరిచేలల్లో నష్టం కలిగించే వాటిలో ప్రధానమైనది ఎలుకల భయం. ముందస్తుగా వరి సాగు చేస్తున్న చేలల్లో వరి దుబ్బు తీపి ఎక్కడంతో ఎలుకలు వరిని కొరకుతూ నష్టాన్ని కలిగిస్తున్నాయి. రైతులు ఎలుకల బుట్టలు పెడుతున్నారు. ఒక్కో ఎలుకు రూ.20 చెల్లిస్తున్నారు. మరికొంత మంది ఎలుక కన్నాలను గుర్తించి పొగబెట్టి ఎలుకలను పట్టుకుంటున్నారు. ఒక్కో ఎలుకకు దాదాపు రూ.30 నుంచి రూ.40 చొప్పున రైతులు చెల్లిస్తున్నారు. ఎలుకలు పట్టుకునేందుకు వచ్చిన వారు కొందరు గ్రామాల్లో రైతులను కలుసుకుని ఎలుకలు చంపటానికి ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. ఎలుకల నిర్మూలనకు ప్రభుత్వం మందును సరఫరా చేసి, సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపడితే అధిక ప్రయోజనం ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

బ్రోమోడయలిన్ మందు పంపిణీ ఎప్పుడో

సాధారణంగా వరి నాట్లు వేసిన వెంటనే సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఇప్పటికే కొంత మంది వరి నాట్లు వేసి 50 రోజులు కావస్తుంది. అయినా ఏటా బ్రోమోడయలిన్ మందు సరఫరాలో జాప్యం చోటు చేసుకుంటుంది. ఈ ఏడాది కూడా ఇప్పటికింకా ఎలుకల మందును సరఫరా చేయకపోవడం పట్ల రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పంట నాశనమవు తోంది



ఎలుకల దాడికి గురైతే వరి పంట సర్వనాశనమవుతుంది. ఎలుకలు వరి దుబ్బులను మొదలంటా కొరికి పారవేస్తుండటంతో మొక్క పూర్తిగా చనిపోతుంది. ఫలితంగా ఎకరానికి సుమారు 5 నుంచి 7 బస్తాలు దిగుబడి తగ్గిపోతుంది.

– మద్దు సుధీర్ బాబు, రైతు, పిడపర్రు

ప్రభుత్వం ఆదుకోవాలి

మార్కెట్‌లో దొరికే ఖరీదైన మందులు వాడినా అవి తినటం లేదు. ప్రభుత్వం స్పందించి ఎలుకలు చనిపోయే విధమైన మందులను పంపిణీ చేసి ఆదుకోవాలి.

– బి.రాము, రైతు, వల్లభాపురం

ఇప్పుడిప్పుడే పెరుగుతున్నాయి



ఎలుకలు వరి పంటను అక్కడక్కడ నష్టపరుస్తున్నట్లు రైతులు రెండు రోజుల నుంచి చెబుతున్నారు. సామూహిక ఎలుకల నివారణకు బ్రోమోడయలిన్ మందును వ్యవసాయ శాఖ ద్వారా ఈ నెల చివరిలో సరఫరా చేయటం జరుగతుంది.

– కె.వెంకటరావు, ఏవో, కొల్లిపర

మున్సిపల్ ఆదాయం పెంచేందుకు ప్రత్యేక చర్యలు

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

తెనాలిఅర్బన్: మున్సిపల్ ఆదాయం మరింత పెంచేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మంగళవారం సాయంత్రం మున్సిపల్ అధికారులతో సమీక్ష జరిపారు. తెనాలి పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. అలాగే శానిటేషన్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ వంటి విభాగాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ ఆదాయాన్ని పెంచేందుకు పీపీ పద్ధతిని ఉపయోగించుకోనున్నట్లు తెలిపారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరిగే విధంగా చూడాలన్నారు. డెంగీ ఎవరికైనా సోకితే వెంటనే తమకు తెలియజేయాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 16న జిల్లా పరిధిలోని తెనాలిలో 3, మంగళగిరిలో 3, గుంటూరులో 7 క్యాంటీన్లను పునఃప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పన్నుల వసూలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవర్ జగన్నాథ్, సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్, స్పెషల్ ఆఫీసర్ గాయత్రీదేవి, కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ అనూష, మేనేజర్ అప్పలరాజు, ఏసీపీలు సుధాకర్, సుబ్బారావు, ఇన్‌చార్జి ఎంఈ శ్రీనివాసరావు, ఆర్‌వో సోమశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జేఎంజేలో 'నషా ముక్త్ భారత్ అభియాన్'



తెనాలిఅర్బన్: కేంద్ర సామాజిక న్యాయ సాధికారిత మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు జేఎంజే కళాశాలలో మంగళవారం నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ మాట్లాడుతూ చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉంటూ దేశ భక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అరుణ సుజాత, కళాశాల డీన్స్ డాక్టర్ ఉమామహేశ్వరి, డాక్టర్ సుధాకరయ్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

పంట నమోదు పక్కాగా చేయాలి



మాట్లాడుతున్న ఏడీఏ ఉషారాణి

తెనాలిరూరల్: పంట నమోదు పక్కాగా చేయాలని, కోతల ప్రయోగాలను పూర్తి స్థాయిలో నమోదు చేస్తేనే రైతులకు మేలు జరుగుతుందని వ్యవసాయ విస్తరణాధికారి ఎన్.ఉషారాణి తెలిపారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని పొదుపు భవన్‌లో మంగళవారం సాయంత్రం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద పంట నమోదు, పంట కోత ప్రయోగాలపై నిర్వహించిన సమావేశంలో తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు. తెనాలి సబ్ డివిజన్ పరిధిలోని ఆయా మండలాల స్టాటిస్టికల్ ఆఫీసర్లతో పాటు వ్యవసాయ విస్తరణాధికారి ఎన్.ఉషారాణి పాల్గొన్నారు. వరి పంటపై ప్రతి రెవెన్యూ గ్రామానికి నాలుగు ప్రయోగాలు నిర్వహిస్తామని, ఈ ప్రయోగాలతో వచ్చిన దిగుబడుల ఆధారంగా ఆ గ్రామ సరాసరి నిర్ణయిస్తామని ఏడీఏ తెలిపారు. గత ఐదేళ్ల సరాసరి దిగుబడితో పోల్చి తక్కువగా ఉంటే రైతులకు పంట ఇన్సూరెన్స్ ఇస్తామని తెలియజేశారు. ఇంతటి ముఖ్యమైన పంటకోత ప్రయోగాల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ఎరువులు సొసైటీలు, డీలర్ల ద్వారా రైతులకు విక్రయించాలని తెలిపారు. అదే విధంగా క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే వీఏఏలు, ఎంపీఈవోలు, వీహెచ్ఏలకు తెనాలి ఏఎస్‌వో వాసుబాబు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కొల్లిపర ఏఎస్‌వో టి.మనోహర్‌రెడ్డి, ఆయా మండలాల ఏవోలు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాలు పంపిణీ

తెనాలిరూరల్: తెనాలికి చెందిన ట్రైబల్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తెనాలి మండలం కొలకలూరు గ్రామ కాల్వ కట్టల వెంబడి, రైల్వే స్టేషన్ సమీపంలో నివసించే పేదలకు నిత్యావసరాలను మంగళవారం పంపిణీ చేశారు. నిరుపేదలైన వారిని ఆదుకుని వారి జీవన విధానాన్ని మార్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని ట్రస్ట్ డైరెక్టర్ రావూరి అంజలి ఈ సందర్భంగా కోరారు.



ప్రారంభంకానున్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు



బాయ్స్ హైస్కూల్‌లో...



ఎన్ఎస్ఆర్ స్కూల్‌లో...

తెనాలిఅర్బన్: కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నాలుగు యూనిట్లను త్వరలో ప్రారంభించనున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు షేక్ మౌలాబీ పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తాడికొండలో ఈ నెల 6 నుంచి 12 వరకు జరిగిన బేసిక్ స్కౌట్స్ మాస్టర్ ట్రెయినింగ్‌ను తమ ఉపాధ్యాయులు పరిశా సర్దార్, మండె శ్రీనివాసులు పూర్తి చేసుకున్నట్లు చెప్పారు. వారిని అభినందించారు. సమావేశంలో కొడాలి గోవర్ధన్, పాలకొల్లు కోమలి తదితరులు పాల్గొన్నారు.

■ మారీసుపేటలోని ఎన్ఎస్ఆర్ ఎన్ఎంహెచ్ స్కూల్‌లో రెండు కొత్త స్కౌట్స్ యూనిట్లను ప్రారంభించనున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు పి.వి.సుధారాణి తెలిపారు. యూనిట్లకు శిక్షణ పొందిన కె.స్వామి, పులి భాస్కర్‌లు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తారని చెప్పారు.

రెవెన్యూ సదస్సు నిర్వహణపై అవగాహన

మేడికొండూరు: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహణపై అవగాహన కార్యక్రమం మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. తహసీల్దారు పద్మనాభుడు మాట్లాడుతూ గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దారు కుంభా శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంచాయతీలకు ఆదాయాన్ని పెంచేలా కృషి చేయాలి



వ్యర్థాల ద్వారా వర్మీ కంపోస్ట్ తయారీని వివరిస్తున్న ఈవోపీఆర్డీ పూర్ణశంకరావు

కొల్లిపర: గ్రామ పంచాయతీలకు ఆదాయాన్ని పెంచేందుకు పంచాయతీ కార్యదర్శులు, పాలకవర్గాలు ఎల్లప్పుడూ కృషి చేయాలని ఈవోపీఆర్డీ పూర్ణశంకరరావు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు రెండవ రోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణపై క్షేత్ర స్థాయి పర్యటన నిర్వహించి, వర్మీ కంపోస్ట్ మార్కెటింగ్ గురించి ప్రయోగాత్మకంగా వివరించారు. ఘన వ్యర్థాల నిర్వహణ ద్వారా పంచాయతీలకు ఏవిధంగా ఆదాయం పెంచుకోవచ్చు అన్న అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో చంద్రమోహన్, వివిధ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మిగిలిన పనులు త్వరగా పూర్తిచేయండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: అన్న క్యాంటీన్ మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. మార్కెట్ యార్డులోని అన్న క్యాంటీన్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. పూర్తి చేయాల్సిన పనులపై ఆరా తీసి వాటిని రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 16న పట్టణంలో మూడు అన్న క్యాంటీన్‌లను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట పలువురు ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

మానసిక వికలాంగులకు ఉచిత న్యాయ సహాయం



మాట్లాడుతున్న న్యాయవాది కిషోర్

తెనాలిరూరల్: మానసిక వికలాంగులకు తెనాలి మండల న్యాయ సేవ కమిటీ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తారని, అవసరమైన వారు దానిని సద్వినియోగపర్చుకోవాలని ప్యానల్ న్యాయవాది అప్పల కిషోర్ తెలిపారు. తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్,11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు ఆదేశాల మేరకు స్థానిక బాలాజీరావుపేటలోని భవిత కేంద్రంలో మానసిక వికలాంగుల హక్కులు, అవసరాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది మాట్లాడుతూ మానసిక వికలాంగులకు ప్రత్యేక చట్టాలు వర్తిస్తాయని తెలిపారు. చట్టాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. చట్టాలను ప్రజలకు చేర వేసేందుకు న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పారాలీగల్ వలంటీర్ యర్రంశెట్టి అనిల్ కుమార్ మాట్లాడుతూ దేశంలోని ప్రజలందరికీ ఎటువంటి భేదాలు లేకుండా సమాంతర న్యాయం అందించాలనే లక్ష్యంతో 1987లో న్యాయ సేవల చట్టం ప్రవేశ పెట్టారని, 1995 నవంబర్ 9వ తేదీ నుంచి ఈ చట్టం అమలులోకి వచ్చిందన్నారు. మండల విద్యాశాఖ అధికారి వి.జయంత్‌బాబు, భవిత కేంద్రం ఉపాధ్యాయులు సునీత, రజనీకుమారి పాల్గొన్నారు.

పోస్టాఫీసుల్లో జాతీయ జెండాలు లభ్యం



జాతీయ జెండాలను ఆవిష్కరిస్తున్న కరుణాకర్‌బాబు

తెనాలిరూరల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మహనీయుల త్యాగాలు మననం చేసుకోవడంతో పాటు ప్రతి భారతీయుడు దేశభక్తిని చాటుతూ ఇంటిపైన జాతీయ జెండాను ఎగురవేయాలన్న ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు పోస్టల్ శాఖ జాతీయ జెండాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందులో భాగంగా పట్టణానికి చెందిన నటరాజ్ జ్యుయలరీస్ సంస్థ చైర్మన్ కొత్తమాసు కుమార్ పోస్టల్ శాఖ నుంచి జాతీయ జెండాలను కొనుగోలు చేసి తమ సంస్థలోని సిబ్బందికి, ముఖ్య ఖాతాదారులకు అందజేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారతీయులందరూ వారి వారి ఇళ్లపై జాతీయ జెండా ఎగురవేయాలని, పోస్టల్ శాఖ ద్వారా తమ కార్యాలయాల్లో మువ్వన్నెల జెండాలను సిద్ధంగా ఉంచిందని పోస్టల్ శాఖ తెనాలి సూపరింటెండెంట్ కరుణాకర్ బాబు తెలియజేశారు. స్థానిక గంగానమ్మపేటలోని నటరాజ్ జ్యుయలరీ మార్ట్‌లో మంగళవారం జాతీయ జెండాలను ఆవిష్కరించిన కరుణాకర్‌బాబు ప్రతి ఒక్కరు పోస్టాఫీసులో జాతీయ జెండాలను తీసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో నటరాజ్ జ్యుయలరీ మార్ట్ అధినేత కొత్తమాసు కుమార్, కొత్తమాసు రఘురామ్, సిబ్బంది, పోస్టల్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు



దంత పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

తెనాలి: పట్టణానికి చెందిన సిరి దంత వైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కొత్తపేటలోని వివేక పబ్లిక్ స్కూల్, వివేక ఫాస్టర్ స్కూల్ విద్యార్థులకు ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. సిరి దంత వైద్యశాల డాక్టర్లు షహనాజ్, సల్మా, నాగూర్‌బీ, మంజూషలు 500 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. దంతాల పరిరక్షణకు అవసరమైన సలహాలను ఇచ్చారు. మనిషి ఆరోగ్యానికి దంత సంరక్షణ ఎంతో ముఖ్యమని వివేక విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కె.రామరాజు వెల్లడించారు. ప్రతిరోజూ ఉదయం, రాత్రి బ్రష్ చేసుకోవాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు. తమ విద్యార్థులకు దంత పరీక్షలు చేసి, అవసరమైన సూచనలను చేసిన సిరి దంత వైద్యశాల వైద్యులకు వివేక డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యశాల మేనేజర్ జగదీష్, ప్రిన్సిపాల్ దీవి రాధాకృష్ణమాచార్యులు, ఉపాధ్యాయులు కమలజ, దుర్గాభవాని, గణేష్‌బాబు, రాజేశ్వరి, శిరీష, సిబ్బంది మురళి, రాంబాబు పాల్గొన్నారు.

మోదుకూరి జాన్సన్ సినీ సాహిత్యంపై పుస్తకావిష్కరణ



తెనాలిరూరల్: సినీ రచయిత మోదుకూరి జాన్సన్ సినీ సాహిత్యంపై తలతోటి పృథ్వీరాజ్ పుస్తకాన్ని రచించారు. దీనిని కొలకలూరులో మంగళవారం ఆవిష్కరించారు. పుస్తకాన్ని గ్రామానికి చెందిన దివంగత పొన్నెకంటి సత్యవేదాంతాచారికి రచయిత అంకితమిచ్చారు. సత్యవేదాంతాచారి తోబుట్టువులు సునీల, విజయవర్ధన్, ఝాన్సీలక్ష్మి, రత్నాకర్‌లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సుద్దపల్లి శరత్‌వెంకయ్య, మురళీధర్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి



తెనాలిఅర్బన్: వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కె.బాబుప్రసాద్, యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.శ్యామ్‌లు డిమాండ్ చేశారు. ఏపీ యునైటెడ్ విలేజ్ అండ్ వార్డ్ హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న మెడికల్ సిబ్బందిని ఇతర ప్రభుత్వ శాఖలకు ట్రాన్స్‌ఫర్ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. వెంటనే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. సర్వీసు రెగ్యులరైజేషన్ చేసే సమయంలో యూనియన్ నాయకులతో సంప్రదించకపోవడం బాధాకరమన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పి.శ్యామల, ఉపాధ్యక్షులుగా బేగం, ప్రధాన కార్యదర్శిగా పి.సునీత, అదనపు కార్యదర్శిగా ఎన్.సునీత, కమిటీ సభ్యులుగా వి.అనితలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు చెప్పారు. అనంతరం వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్‌వలీ తదితరులు పాల్గొన్నారు.